క్లుప్తంగా

పట్టణంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు



గుడివాడ టౌన్: గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పిలుపు మేరకు ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్‌క్లబ్ గుడివాడ స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించినట్లు క్లబ్ అధ్యక్షుడు ఎం.శివరామకృష్ణ తెలిపారు. సోమవారం స్థానిక 36వ వార్డులో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులతో కలసి స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించామన్నారు. పురవీధుల్లో చెత్తను తొలగించడంతో పాటు రోడ్లపై చెత్త వేయవద్దని స్థానికులకు వివరిస్తూ కార్యక్రమం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి కోనా రామారావు, కోశాధికారి కె.రామకృష్ణ, పి.సత్యనారాయణ, అర్జా ప్రసాదు, ఎల్.శివరామ్‌ప్రసాద్, బి. కుటుంబరావు, ఎం.ఆంజనేయులు, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

కలెక్టర్ బాలాజీకి సన్మానం




పామర్రు: కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీని పామర్రుకు చెందిన ఆర్యవైశ్య యువజన సంఘ నాయకులు మర్యాద పూర్వకంగా సోమవారం కలిశారు. పామర్రులో ఓ కార్యక్రమానికి కలెక్టర్ వచ్చారు. ఈ నేపథ్యంలో ఆర్యవైశ్య యువజన సంఘ సభ్యులు కలెక్టర్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బొమ్మిశెట్టి బ్రదర్స్, ఊటుకూరి హనమ పిచ్చేశ్వరరావు, బొగ్గరపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

కౌలు రైతు కార్డుల అందజేత



మండవల్లి: పెరికెగూడెం రైతు భరోసా కేంద్రం వద్ద సోమవారం కౌలురైతు కార్డులు (సీసీఆర్‌సీ) రైతులకు అందజేశారు. సహాయ వ్యవసాయ సంచాలకులు జి.వెంకటమణి సీసీఆర్‌సీ కార్డుల ఉపయోగాలు వివరించారు. ఆమె మాట్లాడుతూ కౌలు రైతు కార్డులు తీసుకోవడం వల్ల కౌలు రైతులు గ్రూపులుగా ఏర్పడి పంట రుణం తీసుకోవచ్చన్నారు. ఎరువులు, విత్తనాలు సబ్సిడీపై పొందవచ్చని తెలిపారు. పంట నష్టం ఏర్పడితే పంట నష్ట పరిహారం కౌలు రైతు పొందవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎస్‌కే జరీనా, వీఏఏ గోపాల్, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది గౌతమ్, నాగ విజయ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



కైకలూరు: సంతోషంలోనే కాదు.. కష్టం వచ్చినప్పుడూ మేమున్నామంటూ రెండు కుటుంబాలకు గ్రామస్తులు ఆపన్నహస్తం అందించారు. ఈ నెల 12న కోరుకొల్లు నుంచి స్వగ్రామం వేమవరప్పాడు ద్విచక్రవాహనంపై వస్తుండగా గ్రామానికి చెందిన సాయిల కిషోర్ కుమారుడు దుర్గాప్రసాద్ (19), బోడావుల నాగరాజు కుమారుడు దుర్గాప్రసాద్ (18) చీకటిలో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో మృతి చెందారు. ఇరువురికి వారి కుటుంబ సభ్యులు దశదిన కర్మ సోమవారం పూర్తి చేశారు. గ్రామస్తులు అందరూ కలిసి ఒక్కో కుటుంబానికి రూ.71,000 చొప్పున రెండు కుటుంబాలకు రూ.1,42,000 సాయం అందించారు. కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ రూ.20,000 బాధిత కుటుంబాలకు అందజేశారు. దీనికి సంబంధించిన చెక్కులను బోయిన గోవర్ధన, తలారి శ్రీహరి బాధిత కుటుంబాలకు అందించారు.

నేటి నుంచి ఆధార్ మొబైల్ క్యాంపులు

కైకలూరు(కలిదిండి): మండలంలో మంగళవారం నుంచి ఆధార్ మొబైల్ క్యాంపుల ద్వారా నమోదు, మార్పులు, చేర్పులు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.దినతేజ్ సోమవారం తెలిపారు. ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు ఈ శిబిరాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. కలిదిండి గ్రామ పంచాయతీ కార్యాలయంలో 23, 24 తేదీలు, మూలఉప్పరగూడెం సచివాలయంలో 25, 26, 27 తేదీల్లో క్యాంపులు నిర్వహిస్తామని తెలిపారు.

జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడులు

వ్యవసాయశాఖ ఏడీఏ రమాదేవి



నీట మునిగిన పంట పొలాలను పరిశీలిస్తున్న ఏడీఏ రమాదేవి, ఏఓ అనంతలక్ష్మి

గుడివాడరూరల్: వర్షాలతో నీట మునిగిన వరి పొలాల్లో జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయశాఖ ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి పేర్కొన్నారు. మండలంలోని లింగవరం, మెరకగూడెం, వలివర్తిపాడు, మోటూరు, బొమ్ములూరు గ్రామాల్లో నీట మునిగిన పంట పొలాలను మండల వ్యవసాయశాఖ అధికారి బోలెం అనంత లక్ష్మి, సిబ్బందితో కలసి సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ జూన్, జూలై నెలల్లో వెదజల్లిన పంట పొలాల్లో, నారుమడుల్లో ప్రస్తుతం కురిసిన వర్షాల వలన పల్లపు ప్రాంతాల్లో పంట పొలాలు ముంపునకు గురయ్యాయన్నారు. దీని వలన నారుమడులు, వరినాట్లు దెబ్బతినే అవకాశం ఉందన్నారు. ముంపునకు గురైన పంట పొలాలను కాపాడుకునేందుకు రైతులు తీసుకోవాల్సిన చర్యలను తెలిపారు. విత్తనం వెదజల్లిన 15రోజుల లోపు ఉన్న నారుమడులు, వెదజల్లిన పొలాలకు సంబంధించి మూడు రోజులకన్నా ఎక్కువ నీటిలో మునిగితే మొలక శాతం దెబ్బతింటుందన్నారు. ఎంటీయూ-1440 రకం మాత్రమే 10 రోజుల వరకు నీటిలో మునిగినా 80 శాతం మొలకెత్తే సామర్థ్యం ఉంటుందని తెలిపారు. మొలక దెబ్బతింటే నారు దొరికితే నాట్లు వేసుకోవడం, లేదా స్వల్పకాలిక రకాలైన ఎంటీయూ-1121, ఎంటీయూ-1210, ఎంటీయూ- 1156, ఎన్ఎల్ఆర్-344,349, ఎన్ఎల్ఆర్-3354, ఎంటీయూ-1223, ఎంటీయూ-1273, ఎంటీయూ-1010 వంటి రకాలు సాగు చేసుకోవాలని ఆమె రైతులకు సూచించారు. దీర్ఘకాలిక రకాలు సాగు చేస్తే రెండో పంట అయిన మినుము ఆలస్యమయ్యే అవకాశం ఉంటుందన్నారు. వర్షాల వలన పంటలు దెబ్బతిన్నా స్వల్పకాలిక రకాలు నాట్లు వేయడం ద్వారా నష్టాన్ని నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. ఐదు రోజులు కన్నా ఎక్కువ నీట మునిగిన నారుమడి, వెదజల్లిన పంట పొలాలు పూర్తిగా దెబ్బతింటాయన్నారు. ఐదు రోజులు మునిగిన నారుమడుల్లో పూర్తిగా నీరు బయటకు తీసి ఐదు సెంట్ల నారుమడికి కిలో యూరియా, ఒక కట్ట మ్యూరెట్ ఆఫ్ పొటాషియమ్‌ను బూస్టర్ డోస్‌గా వేసుకుని పిచికారీ చేస్తే వారం రోజుల్లో కొత్త చిగురు వస్తుందన్నారు. అలాంటి నారుమడులు కుళ్లకుండా లీటర్ నీటికి గ్రాము చొప్పున కార్బండిజం మందును పిచికారీ చేసుకోవాలన్నారు. అదేవిధంగా ఐదు నుంచి 30 రోజుల్లో వెదజల్లిన పొలాల్లో మునక సమస్య తలెత్తితే సాగులో ఎకరానికి 10 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్‌ను కలిపి బూస్టర్ డోస్‌గా వేయాలని సూచించారు. రైతులు ముంపు బయటకు పోయిన తర్వాత మాత్రమే యాజమాన్య చర్యలు చేపట్టాలని ఆమె తెలిపారు. మరిన్ని సలహాలు, సూచనలకు గ్రామాల్లోని వ్యవసాయశాఖ సిబ్బందిని రైతులు సంప్రదించాలని ఆమె కోరారు.

ముంపు నీటిని బయటకు పంపించాలి

మండవల్లి: అల్పపీడనం వల్ల కురుస్తున్న అధిక వర్షాలకు వివిధ దశల్లో ఉన్న వరి పంట ముంపునకు గురవుతోందని, ఆ నీటిని వెంటనే బయటకు పంపించాలని ఏఓ జరీనా తెలిపారు. జూన్‌లో నాట్లు వేసిన పొలాల్లో వరి పైరు పిలక దశలో, కొన్ని చోట్ల నారుమడి దశలో, వెదజల్లిన పొలాలు మొలక దశ నుంచి మొక్క దశలో ఉన్నాయని పేర్కొన్నారు. మునిగిన నారు మడి నుంచి నీరు ఐదు రోజుల్లోపు పూర్తిగా బయటకు తీసి వేసిన తర్వాత ఐదు సెంట్ల నారుమడికి కిలో యూరియా, కిలో పొటాష్ వేసుకోవాలని తెలిపారు. ఒకటి లేదా రెండు గ్రాముల కార్బండిజం, మాంకోజెబ్ పిచికారీ చేసుకోవాలని పేర్కొన్నారు. పిలక దశలో వరి పంట మునిగితే నీరు బయటకు పోయిన తర్వాత ఎకరానికి 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ అదనంగా వేసుకోవాలని ఏఓ తెలిపారు.

రైతులకు అవగాహన



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ అధికారులు

పామర్రు: నీట మునిగిన వరి పొలాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను మచిలీపట్నం డీఆర్‌సీ ఏడీఏ కె.శ్రీనివాసరావు రైతులకు తెలియజేశారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునిగిన నారుమడిలో నీటిని బయటకు తీసి, ఒక ఎకరానికి ఒక కేజీ యూరియా, కేజీ పొటాష్ వేయాలన్నారు. అలాగే ప్రధాన పొలంలో నీరు ఉన్న బయటకు తీసి ఒక ఎకరానికి 20 కేజీల యూరియా, 20 కేజీల పొటాష్ వేయాలని తెలిపారు. ఏఆర్ఎస్ ఘంటసాల కలుపు విభాగం శాస్త్రవేత్త జె పద్మావతి మాట్లాడుతూ వెదజల్లిన వరి పొలాల్లో, నారుమడుల్లో కలుపు నివారణను వివరించారు. నారుమడిలో ఊద నిర్మూలనకు విత్తిన 15 రోజుల్లో సైకలోపాస్ బ్యూటైల్ 10 శాతం 400 మిల్లీలీటర్లను పిచికారీ చేయాలన్నారు. మాగాణి వరిలో ఊద నిర్మూలనకు బ్యూటాక్లోర్ 50 శాతం ఒక లీటరుకు 25 కేజీలు పొడి ఇసుకలో కలిపి మూడు నుంచి ఐదు రోజుల్లో వెదజల్లాలన్నారు. నాటిన 25-30 రోజులప్పుడు వెడల్పాటి కలుపు మొక్కల ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు ఎకరాకు 400 గ్రాముల 2.5 సోడియం సాల్ట్ 80 శాతం పిచికారీ చేయాలని తెలిపారు. అనంతరం అధికారులు సాగులో ఉన్న వరి పొలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్‌సీ ఏఓ బి.పద్మజ, ఏఆర్ఎస్ ఉయ్యూరు శాస్త్రవేత్త కె. సుధారాణి, పామర్రు ఏడీఏ బి.స్వర్ణలత, ఏఓ శివ నాగరాణి, వీఏఏలు పాల్గొన్నారు.

గోవులకు ముద్ద చర్మ వ్యాధి నివారణ టీకాలు



వీధుల్లో తిరుగుతున్న గోవులకు ఉచిత టీకాలను వేస్తున్న పశువైద్య సిబ్బంది

కైకలూరు: ముద్ద చర్మ వ్యాధి (లంపి స్కిన్ డిసీజ్ వైరస్) సోకిన 100 సంచార గోవులకు ఉచిత నివారణ టీకాలను కై కలూరులో పశువైద్య సిబ్బంది సోమవారం వేశారు. ఈ సందర్భంగా కై కలూరు పశుసంవర్ధక సహాయ సంచాలకుడు డాక్టర్ పి.ముస్తాఫఖాన్ మాట్లాడుతూ లంపి స్కిన్ డిసీజ్ వ్యాధి కాప్రిపాక్స్ వైరస్ జాతికి చెందినదని తెలిపారు. ఈ వ్యాధి సోకితే చర్మపు బొబ్బలు ఆవుల తల, మెడ అవయవాలు, పొదుగు జననేంద్రియాలపై కనిపిస్తాయన్నారు. ముద్ద చర్మ వ్యాధి నివారణకు కైకలూరు మండలానికి 1,000, కలిదిండి మండలానికి 1,400 ఉచిత టీకా డోసులు సరఫరా చేశామన్నారు. రెండు మండలాల్లోని ఆవుల పోషకులు ఉచిత టీకాల కోసం స్థానిక పశువైద్యుడిని సంప్రదించాలని పేర్కొన్నారు. వీధుల్లో తిరుగుతున్న ఆవులను గుర్తించి ఉచిత టీకాలను అందిస్తున్నామన్నారు గోసంరక్షకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక పశువైద్య సిబ్బంది ఉషారాణి, మనోజ్, మహేష్, లోకేష్, జయరాం పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

గుడివాడ టౌన్: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలు తెలుసుకునేందుకు మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ జి. రాజేష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 11.30 గంటల నుంచి 12.30 గంటల వరకు ఫోన్‌లైన్‌లో అందుబాటులో ఉంటామని పేర్కొన్నారు. సమస్యలు, సలహాలు, సూచనలు ఇవ్వదలచినవారు 99592 25464కు ఫోన్ చేయాలని కోరారు.

ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలి

ముదినేపల్లి రూరల్ : ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో హెచ్‌ఆర్‌పీ పాలసీ అమలు, సిబ్బంది జీతాలు చెల్లింపుపై ఆంక్షలు విధిస్తూ జిల్లా సహకారాధికారి జారీ చేసిన ఉత్తర్వులు వెంటనే ఉపసంహరించుకోవాలని ఏపీపీఏసీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.రఘురాం పేర్కొన్నారు. ఐదేళ్లగా సహకార సంఘాల్లో విధులు నిర్వహిస్తూ జీతాలు పొందుతుంటే పట్టించుకోని అధికారులు ఇప్పుడు అర్థాంతరంగా సిబ్బంది జీతాలు నిలిపివేయాలని లేకుంటే పర్సన్ ఇన్‌చార్జిలదే పూర్తి బాధ్యత అని, ఉత్తర్వులు జారీ చేయడం దారుణమని పేర్కొన్నారు. జిల్లా సహకార శాఖాధికారి ఈ ఉత్తర్వులు వెంటనే ఉపసంహరించుకోవాలని, లేకుంటే ఈ నెల 30న అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా చేస్తామని హెచ్చరించారు.

ప్రజాసమస్యల పరిష్కార వేదికలో రెండు అర్జీలు



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న డీటీ నాగమల్లేశ్వరరావు

పామర్రు: 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీ కోసం'లో రెండు అర్జీలు వచ్చినట్లు డిప్యూటీ తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మీ కోసం కార్యక్రమం సోమవారం జరిగింది. పామర్రు పంచాయతీ పరిధిలోని అరండాల్‌పేట, కోటిరెడ్డిపేట, గాంధీనగరం ప్రజలు తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఆయా ప్రాంతాల్లోని మురుగునీరు దిగువకు ప్రవహించని కారణంగా అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. పామర్రు డ్రెయిన్ ఉరుటూరు వంతెన నుంచి పామర్రు వార్పు వద్ద బందరుకాలువలో కలుస్తుందని తెలిపారు. ఆయా ప్రాంతాల్లోని మురుగునీరు అంతా వచ్చి పామర్రు డ్రెయిన్‌లో కలవాలన్నారు. కానీ డ్రెయిన్ పూడుకుపోవడం వలన నీరు దిగువకు ప్రవహించక ఎక్కడి మురుగు అక్కడే అనే విధంగా ఉందని పేర్కొన్నారు. మురుగునీరు నిల్వ ఉండటం కారణంగా దోమలు, ఈగలకు ఆలవాలంగా మారి ఆయా ప్రాంతాల వారు అనారోగ్యాలబారిన పడే ప్రమాదం ఉందన్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులతో మాట్లాడి పామర్రు డ్రెయిన్‌లో పూడిక తీత పనులు చేయించాలని కోరుకుంటున్నామని అర్జీని అందజేశారు. కోటిరెడ్డి పేటలో మురుగునీటిలో తాగునీటి కుళాయి ఉండటంతో ఇబ్బందులు పడుతున్నామని, కుళాయిని వెంటనే వేరే స్థలం వద్దకు మార్పు చేయాలని కోరుతూ అర్జీ వచ్చిందన్నారు. ఈ అర్జీల పరిష్కారం కోసం తగు చర్యలు తీసుకుంటామని డీటీ తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

కంకిపాడు: యువతి అదృశ్యమైన సంఘటనపై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆదివారం రాత్రి కేసు నమోదైంది. ఎస్ఐ డి.సందీప్ కథనం మేరకు.. మండల కేంద్రమైన కంకిపాడుకు చెందిన యువతి (21) డిగ్రీ వరకూ విద్యనభ్యసించి ఇంటి వద్దే ఉంటోంది. ఈ నెల 19న అంకమ్మ తల్లి గుడికి వెళ్లి వస్తానని చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీనిపై యువతి మామ్మ శివలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు.

పైపులైన్లను పునరుద్ధరించాలి



తహసీల్దార్ సుభానికి వినతిపత్రం అందజేస్తున్న ఐక్య వేదిక ప్రతినిధులు

మండవల్లి: జాతీయ రహదారి విస్తరణ పనుల్లో పలు చోట్ల ధ్వంసమైన తాగునీటి పైపులైన్లను మార్పిడి చేసి, స్వచ్ఛమైన తాగునీరు ప్రజలకు అందేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు, మండల శాఖ అధ్యక్షుడు టి.అప్పారావు తహసీల్దార్ సుభానికి సోమవారం వినతిపత్రం అందజేశారు. గ్రామ పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఈ మేరకు సమిష్టిగా కృషి చేయాలని పేర్కొన్నారు. లీకేజీ వల్ల మురుగు నీరు పైపుల్లోకి చేరి కలుషితమవుతోందన్నారు. కొన్నిచోట్ల పైపులు ధ్వంసమవడంతో మరమ్మతుల సమయంలో కొన్ని చోట్ల రోజుల తరబడి తాగునీరు సరఫరా కావడం లేదన్నారు. గ్రామస్తులందరికీ తాగునీరు సక్రమంగా అందేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

కరాటే పోటీల్లో బంగారు పతకాలు



కరాటే పోటీల్లో బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు

పెనమలూరు: హైదరాబాద్‌లో ఈ నెల 21వ తేదీన జరిగిన అంతర్జాతీయ ఓపెన్ కుంగ్‌ఫూ, కరాటే ఆల్‌స్టైల్స్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో యనమలకుదురుకు చెందిన క్రీడాకారులు బంగారు పతకాలు సాధించారు. యనమలకుదురుకు చెందిన కరాటే మాష్టారు ఎస్.దుర్గారావు జోసెఫ్ సీనియర్ సిటిజన్ విభాగంలో బ్లాక్ బెల్టు కాటా, వెపన్‌కాటా విభాగంలో రెండు బంగారు పతకాలు గెలిచారు. తొమ్మిది సంవత్సరాల విభాగంలో కలర్ బెల్టు కాటా విభాగంలో సోరంపూడి చేతన్‌దీపక్, సోరంపూడి డేవిడ్‌రాజు, సోరంపూడి డేవిడ్‌ప్రకాష్ బంగారు పతకాలు సాధించారు. వీరిని పలువురు అభినందించారు.

మాదకద్రవ్యాలతో ప్రాణాలకు ముప్పు

మచిలీపట్నంటౌన్: మాదక ద్రవ్యాలను తీసుకోవటంతో ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని, వాటికి దూరంగా ఉండాలంటూ మహిళలు సోమవారం గళమెత్తారు. స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో స్థానిక కోనేరుసెంటరులో మాదకద్రవ్యాల నిర్మూలన, వాటిని తీసుకోవటం వల్ల కలిగే నష్టాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలను జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కేవీ రామకృష్ణయ్య వివరించారు. కార్యక్రమంలో నగర కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు, ట్రాఫిక్ ఎస్ఐ సత్యనారాయణ, ఐసీడీఎస్ పీడీ ఎస్.సువర్ణ, ఈఓ ఎస్.విజయలక్ష్మి, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎల్.మోనిష, మచిలీపట్నం సీడీపీవో కె.గ్లోరి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు వెంకటేశ్వరమ్మ, మాలతీదేవి తదితరులు పాల్గొన్నారు.

ముంపు నివారణ చర్యలు చేపట్టండి



బొమ్మినంపాడులో ముంపు బారిన పడ్డ పొలాలను పరిశీలిస్తున్న అధికారులు

ముదినేపల్లి రూరల్ : వర్షాల వల్ల ముంపుబారిన పడిన పలు గ్రామాల్లోని వరి పొలాలను మండవల్లి సబ్ డివిజన్ ఏడీఏ జి.వెంకటమణి, వ్యవసాయాధికారి బి. వేణుమాధవ్ సోమవారం పరిశీలించారు. మండలంలోని బొమ్మినంపాడు, అల్లూరు, కొరగుంటపాలెంలో ఆయన పర్యటించి ముంపుబారిన పడ్డ పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. పొలాల్లోని వరద నీటిని వెంటనే బయటకు పోయేలా చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు.

ప్రజాస్వామ్య స్ఫూర్తికి దాడులు వ్యతిరేకం

పామర్రు మాజీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పామర్రు: ప్రజాస్వామ్యంలో ప్రజాస్వామ్య స్ఫూర్తికి దాడులు వ్యతిరేకమని పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి పార్టీ నాయకులు, కార్యకర్తలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రస్తుత పరిస్థితులపై ఆరా తీసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో టీడీపీ, జనసేన శ్రేణులు కలిసి చేస్తున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులు ప్రజాస్వామ్య స్ఫూర్తికి వ్యతిరేకమని, ఇకనుంచైనా అధికారంలో ఉన్న నాయకులు ఇటువంటి దాడులను నియంత్రించేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. సామాన్య ప్రజలపై దాడులు మానుకుని అధికారంలోకి రావడానికి ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల అమలుపై దృష్టి సారించాలన్నారు.

అధికారం చేపట్టిన నెల రోజులలోనే పథకాల అమలులో, పరిపాలనలో ప్రస్తుత ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందన్నారు. దాని నుంచి ప్రజల దృష్టి మరల్చడానికి కూటమి ప్రభుత్వం ఇటువంటి దాడులను ప్రోత్సహిస్తుందన్నారు. భవిష్యత్తులో ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే ప్రజల పక్షాన గట్టిగా నిలదీస్తామన్నారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ఎటువంటి పోరాటాలకైనా సిద్ధమన్నారు. నియోజకవర్గంలోని నాయకులకు కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని భరోసా కల్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు

కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

పామర్రు: ఆయిల్ పామ్ సాగులో తక్కువ పెట్టుబడితో అధిక లాభాలను పొందవచ్చని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగుపై గ్రామ స్థాయి ఉద్యాన, వ్యవసాయశాఖ సహాయ సిబ్బందికి, రైతులకు అవగాహన సదస్సును సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తక్కువ కూలీలతో ఎక్కువ ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేయవచ్చన్నారు. ప్రకృతి వైపరీత్యాల భయం లేదని, పంట నష్టం ప్రమాదం లేదన్నారు. పండించిన పంటను సులభంగా అమ్ముకునే విధానం ఈ సాగులో ఉందన్నారు. దళారీ వ్యవస్థ లేకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే పారదర్శకంగా పామాయిల్ గెలల సేకరణ జరుగుతుందన్నారు. మన దేశంలో 140 కోట్లకు పైగా పెరిగిన జనాభా వారి అవసరాలకు పెరుగుతున్న వంట నూనెల డిమాండ్ దృష్ట్యా ఈ పంటను దీర్ఘ కాలం లాభాల బాట నడిపిస్తుందని అనడంలో అతిశయోక్తి లేదన్నారు. ఉద్యాన విభాగం, ఐఓపీఆర్ శాస్త్రవేత్తల తోడ్పాటుతో రైతులకు శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ తాడిశెట్టి శ్రీనివాసరావు, ఉద్యానశాఖ పీడీ విజయలక్ష్మి, శాస్త్రవేత్త మంజువాణి, జిల్లా మేనేజర్ చంద్రబాబు, శరత్‌బాబు, పామర్రు మండల ఉద్యాన శాఖ అధికారి కీర్తి, పామర్రు తహసీల్దార్ శ్రీపల్లవి, ఎంపీడీఓ భారతి పాల్గొన్నారు.

కొండముచ్చులతో భయభ్రాంతులు

పామర్రులో 70 మందికి పైగా బాధితులు



పామర్రులో ఇళ్లపైకి చేరిన కొండముచ్చులు

పామర్రు: పామర్రులో కొండముచ్చులు సమూహంలా ఏర్పడి ప్రతిరోజూ ఇళ్ల పైకి చేరుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. రహదార్లపై వెళ్లే వారిపై దాడి చేసి భయాందోళన కలిగిస్తున్నాయి. మరికొన్ని ఇళ్లల్లోకి ప్రవేశిస్తూ తినుబండారాలను ఎత్తుకుపోతున్నాయి. ఒంటరిగా ఎవరైనా కనబడితే వారిపై తెగబడుతూ వారిని క్షతగాత్రులుగా మారుస్తున్నాయి. స్థానిక నాయీ బ్రాహ్మణ వీధిలో ఒంటరిగా ఉన్న ఒక వ్యక్తిపైకి దూకి కాలును కొరికి పారిపోయింది. ఇంట్లోకి ప్రవేశించిన కొండముచ్చులను ఎవరైనా తోలేందుకు ప్రయత్నిస్తే వారిపై తిరగబడుతున్నాయి. యలమర్రు రోడ్డులోని ఓ ఇంట్లోకి ప్రవేశించి ఆహారం ఎత్తుకు పోతున్న కొండముచ్చులను ఆ ఇంట్లో ఉన్న మహిళ వెంబడించగా ఆమెపై తిరగబడి గాయపర్చాయి. అదేవిధంగా ఇంటి ముందు ముగ్గు వేస్తున్న ఓ మహిళను కొండముచ్చు కరిచి గాయపర్చింది. ఇలాంటి సంఘటనలు ప్రతిరోజూ జరుగుతున్నాయి. రహదార్లపై అడ్డంగా కూర్చొని వాహనదారులను, బాటసారులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ఒక్క పామర్రు పంచాయతీ పరిధిలోనే ఇప్పటి వరకు సుమారు 70 మంది వరకు కొండముచ్చులబారిన పడి ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి కొండముచ్చుల సమస్యను పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇంటిముందు ముగ్గు వేస్తుంటే కరిచింది



ఉదయాన్నే ఇంటి ముందు ముగ్గు వేస్తుండగా వెనుకాలగా వచ్చి ఒక్కసారిగా నా కాలు మడమను పట్టి పీకింది. స్థానిక ఓ ప్రైవేటు వైద్యశాలకు వెళ్లి చికిత్స చేయించుకున్నా. కొండముచ్చుల బారి నుంచి ప్రజలను పంచాయతీ వారు కాపాడాలని కోరుకుంటున్నాను.

– అల్లాడ గౌతమి, పామర్రు

ఉధృతంగా ప్రవహిస్తున్న డ్రెయిన్లు



ముదినేపల్లి సమీపంలో నిండుగా ప్రవహిస్తున్న పోల్‌రాజ్ డ్రెయిన్

ముదినేపల్లి రూరల్ : ఇటీవల కురిసిన వర్షాలతో ప్రధానమైన మేజర్, మీడియం, మైనర్ డ్రెయిన్లు పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తున్నాయి. అల్పపీడనం ప్రభావంతో ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు వరదనీరు మండలంలోని డ్రెయిన్లలోకి వచ్చి చేరుతోంది. దీంతో మండలంలోని ప్రధానమైన పోల్‌రాజ్, పెదలంక, అన్నవరం వంటి మేజర్ డ్రెయిన్లతో పాటు పెదకొమ్మిలేరు, చినకొమ్మిలేరు వంటి మీడియం మైనర్ డ్రెయిన్లు ఉద్ధతంగా ప్రవహిస్తున్నాయి. వీటి ఆయకట్టు పొలాలు ముంపు బారిన పడతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. డ్రెయిన్లలో దట్టంగా గుర్రపుడెక్క పేరుకుపోవడంతో వీటిలో వరద నీరు సక్రమంగా ప్రవహించడం లేదు. దీనికి తోడు మేజర్ డ్రెయిన్లు ఉధృతంగా ప్రవహిస్తున్నందున మీడియం, మైనర్ కాలువల్లోకి నీరు వెళ్లే అవకాశం లేకుండా పోయింది. పలు ప్రాంతాల్లో డ్రెయిన్లు ఆక్రమణలకు గురి కావడంతో ముంపు పొంచి ఉందని రైతులు అంటున్నారు.